క్లుప్తంగా

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి దుర్గాప్రసాద్

నల్లగొండ టౌన్ : నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి బరిగెల దుర్గాప్రసాద్ గురువారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్‌లో తన నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యావంతులందరూ ఆలోచించి తనకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీను, నరేందర్, వెంకన్న, శంకర్, వినోద్, ఎల్లయ్య పాల్గొన్నారు.

పనిచేసే వారిని గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న చొల్లేటి ప్రభాకర్

నల్లగొండ టౌన్ : పనిచేసే వారిని గుర్తించి తమ అమూల్యమైన ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన ఇంటింటా తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటును నోటుకు, మద్యానికి అమ్ముకోకుండా తన టెలిఫోన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు.

కాంగ్రెస్‌కు ముస్లిం మైనార్టీల మద్దతు

కేతేపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ మండల అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్‌జానీ తెలిపారు. గురువారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ముస్లిం మైనార్టీ ప్రజలు భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

మద్యం పట్టివేత

మర్రిగూడ: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కె.రంగారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తూర్పుతండాకు చెందిన పాత్లావత్ నితిన్ వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 36 కేఎఫ్ లైట్ బీర్లను పట్టుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బెల్ట్‌షాపుల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.

అభియోగాలను త్వరగా పరిష్కరించాలి

నకిరేకల్ : సామాజిక తనిఖీ అభియోగాలను త్వరితగతిన పరిష్కరించాలని ఉపాధిహామీ జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాలరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై 12వ విడత సామాజిక తనిఖీలో వచ్చిన గ్రీవెన్స్‌లకు సంబంధించిన అభియోగాలను పరిష్కరించడంలో జాప్యం చేయవద్దన్నారు. సమావేశంలో సోషల్ ఆడిట్ మేనేజర్ గౌతమి, ఏపీఓ రమణయ్య, ఈసీ స్వాతి పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం

చండూరు : చేనేత కార్మికులకు సంబంధించిన పథకాలను విస్మరించిన కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓటు వేయకుండా తగిన బుద్ధి చెప్పాలని చండూరు జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం పిలుపునిచ్చారు. గురువారం గట్టుప్పల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేనేత మిత్ర కింద జియో ట్యాగ్ కలిగిన ప్రతి కుటుంబానికి నెలకు రూ.3,000 వచ్చేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిలిపివేసింది అన్నారు. అలాగే నెలకు రూ.4000 లబ్ధి చేకూరే త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని కూడా ప్రభుత్వం నిలిపివేయాలని చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ అవ్వారి గీత శ్రీనివాస్, ఎంపీటీసీ చెరుపల్లి భాస్కర్, బండారు చంద్రయ్య, పున్న కిశోర్, చిలుకూరి అంజయ్య, తిరందాస్ ఆనంద్, దోర్నాల అమరేందర్, మోద్దు శంకర్‌రెడ్డి, కర్నాటి అబ్బయ్య, భీమగాని యాదయ్య, జెల్ల అంజయ్య, పున్న ఆనంద్, చెరుపల్లి కృష్ణ, చెరుపల్లి రమేష్, పెదగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం !

- విత్తన విక్రయ దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీలు
- రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచిస్తున్న అధికారులు



మునుగోడులోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రవణ్ (ఫైల్)

మునుగోడు: రైతులు విత్తనాల విషయంలో ఎలాంటి మోసాలకు గురికాకుండా ఉండేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం కాబోతుండడతో రైతులు కొనుగోలు చేసే విత్తనాలు నకిలీలు లేకుండా వ్యవసాయ అధికారులు, పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. టీమ్‌ల వారీగా ఎప్పటికప్పుడు దుకాణాలు, అక్రమ వ్యాపారుల ఇళ్లపై సోదాలు నిర్వహిస్తున్నారు. దీంతో నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారుల్లో వణుకు పుడుతోంది.

153 విత్తనాల విక్రయ దుకాణాలు

మునుగోడు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో మొత్తం 153 దుకాణాల ద్వారా విత్తనాలు విక్రయించేందుకు వ్యవసాయ అధికారులు అనుమతులు ఇచ్చారు. అందులో మునుగోడులో 39, చండూరు–48, మర్రిగూడ–31, నాంపల్లి–35 మంది దుకాణదారులు ప్రభుత్వం గుర్తించిన కంపెనీల నుంచి విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలి. అయితే కొందరు వ్యాపారులు ప్రతి ఏటా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలు తీసుకొచ్చి తక్కువ ధరకు రైతులకు అంటగడుతున్నారు. అవి నాణ్యమైనవి కాకపోవడంతో దిగుబడి సరిగా రాక రైతులు అప్పులపాలవుతున్నారు. అలా రైతులు మోసపోయి ఇబ్బందులు పడకుండా విత్తనాలు కొనుగోలు చేయకముందే జిల్లావ్యాప్తంగా విత్తనాల విక్రయ దుకాణాల్లో వ్యవసాయ అధికారులు, పోలీసులు ముందస్తుగా ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. అంతేకాకుండా విత్తన వ్యాపారులకు అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి పలు సూచనలు చేస్తున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధికంగా పత్తి విత్తనాల కొనుగోలు

డివిజన్ వ్యాప్తంగా దాదాపు 63,578 మంది రైతులు లక్షా 86 వేల 57 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అందులో అధికంగా లక్షా 69 వేల 365 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తుండగా 8,200 ఎకరాల్లో వరి, 6,134 ఎకరాల్లో కంది, 2,335 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అయితే 80 శాతంకు పైగా రైతులు పత్తి పంటనే సాగు చేస్తుండడంతో పత్తి విత్తనాలు నకిలీలు లేకుండా చూసేందుకు అధికారులు ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నారు. గత నెల 29న మర్రిగూడ మండలంలో నకిలీ విత్తనాలు పట్టుబడగా పోలీసులు విక్రయదారులపై కేసులు నమోదు చేశారు.

లైసెన్స్‌లు రద్దు చేస్తాం



ప్రభుత్వం అనుమతిచ్చిన విత్తనాలు మాత్రమే వ్యాపారులు విక్రయించాలి. అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే వారి లైసెన్స్ రద్దు చేస్తాం. రైతులు కూడా తక్కువ ధరలకు లభించే విత్తనాలు కొనుగోలు చేయవద్దు. అన్ని అనుమతులు ఉన్నవాటిని కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి.

–ఎస్.శ్రీనివాస్‌గౌడ్, ఏఓ, మునుగోడు

కేసు నమోదు చేయాలి



నకిలీ వ్యాపారుల చేతిలో రైతులు మోసపోకుండా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడం హర్షణీయం. కొందరు వ్యాపారులు అధిక లాభం కోసం నాణ్యత లేని విత్తనాలు రైతులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిని గుర్తించి వ్యాపారుల లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కేసు నమోదు చేయాలి.

–గుర్జ రామచంద్రం, రైతు సంఘం కార్యదర్శి

సమాచారం అందించాలి



ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే మాకు సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. నకిలీ విత్తనాలు పట్టుకునేందుకు గట్టి నిఘా పెట్టాం. నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేస్తాం.

–సీహెచ్ వెంకటేశ్వర్లు, మునుగోడు ఎస్.ఐ

బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి



నకిరేకల్ : ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మునుగోడు : కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

నకిరేకల్ : బీఆర్‌ఎస్ పాలనలోనే నకిరేకల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. భువనగిరి నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ నకిరేకల్‌లోని 2వ వార్డులో గురువారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నకిరేకల్‌లో 100 పడకల వైద్యశాల, రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, వైకుంఠధామాలు బీఆర్‌ఎస్ పాలనలోనే వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ రాచకొండ సునీల్, పెండెం సదానందం, గుర్రం గణేష్, నడికుడి వెంకటేశ్వర్లు అమీర్‌పాష తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ నకిరేకల్ పట్టణంలోని 1వ వార్డు సుందరయ్యనగర్‌లో గురువారం గుర్రం గణేశ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. యానాల లింగారెడ్డి, మాధవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఏమాత్రం అభివృద్ధి చేయలేదు

మునుగోడు: బీఆర్‌ఎస్ పరిపాలనలోనే మునుగోడు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ ఏమాత్రం అభివృద్ధి చేయలేదని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేష్ కారు గుర్తుకు ఓటువేయాలని కోరుతూ గురువారం మునుగోడులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలుచేస్తామని చెప్పి నేటికీ ఎందుకు చేయలేదో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు అమలుచేస్తారని, గెలిపిస్తే అందులో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయరని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి ఐతగోని లాల్‌బహదూర్ గౌడ్, మారగోని అంజయ్య గౌడ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, పోలగోని సైదులు గౌడ్, ఐతగోని విజయ్‌గౌడ్, యడవల్లి సురేష్, ఈద శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్యామ మల్లేష్‌కు మద్దతుగా ప్రచారం

చిట్యాల: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు మద్దతుగా గురువారం మండలంలోని వట్టిమర్తి, పిట్టంపల్లి, చిట్యాల మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కొలను సునిత, ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పర్నే నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీసం బాబు, సామిడి మహేందర్‌రెడ్డి, ఏళ్ళ సత్యనారాయణరెడ్డి, నర్రా శ్రీకాంత్‌రెడ్డి, లెంకల దామోదర్‌రెడ్డి, పాపిరెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

క్యామ మల్లేష్‌ను గెలిపించాలి

నార్కట్‌పల్లి : భువనగిరి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ మల్గ బాలకృష్ణ ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. మాజీ ఉప సర్పంచ్ దోనాల శంకర్‌రెడ్డి, కమ్మంపాటి వెంకటయ్య, కరుణాకర్‌రెడ్డి, శివ, గాదరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

కేతేపల్లి: భువనగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు మద్దతుగా గురువారం బీఆర్‌ఎస్ నాయకులు కేతేపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మాందాసు విజయరాణి, దండు వెంకటేష్, జటంగి వెంకన్న, మహేష్, ఎ.సోమయ్య, సైదులు, వెంకటేష్, పాపయ్య పాల్గొన్నారు.

మర్రిగూడ: భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఖుదాబాక్షపల్లి, మర్రిగూడలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అనంత రాజుగౌడ్, కొలుకులపల్లి నాగయ్య, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య, చెరుకు శ్రీరాములుగౌడ్, రాపోలు యాదగిరి, గండు యాదయ్య, మహేందర్, లక్ష్మయ్య, రాజు, నరేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

నకిరేకల్ : బావిలో జారిపడి నీటిలో కొట్టుమిట్టాడుతున్న శునకాన్ని ఫైర్ సిబ్బంది సురక్షితంగా బయటకు తీశారు. వివరాలు.. నకిరేకల్‌లోని ఎస్‌ఎల్‌బీసీ కాల్వ పక్కన ఉన్న ఓ రైతు వ్యవసాయ బావిలో రెండు రోజుల క్రితం శునకం జారిపడింది. సదరు రైతు గురువారం ఉదయం వచ్చి బావి దగ్గరకు వచ్చి చూసేసరికి శునకం బావిలో అంచున తిరుగుతూ కనిపించింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక ఎస్‌ఐ భీముడు తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. సిబ్బంది తాడు సహాయంతో బావిలోకి దిగి శునకాన్ని తాళ్లతో కట్టి బయటకు సురక్షితంగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, డ్రైవర్ జహీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ: పట్టణంలోని 5వ వార్డుకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు గురువారం మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో స్థానిక కౌన్సిలర్ పున్న గణేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలం చెన్నుగూడెం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు గురువారం నల్లగొండలోని మంత్రి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మర్రి శేఖర్, మర్రి చిరంజీవి, దొండ రాజు, నాగరాజు, మర్రి నరేష్‌లు పాల్గొన్నారు.

అమిత్ సమక్షంలో..

కనగల్: మండల కేంద్రానికి చెందిన 30 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి గుత్తా అమిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీ ఆహ్వానించారు.

నార్కట్‌పల్లి మండలంలో..

నార్కట్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన పలువురు మైనార్టీ యువకులు గురువారం మైనార్టీ నాయకుడు ఎస్‌కె.సమద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో రహీంఖాన్, కరీంఖాన్, యూసుఫ్, హైమద్, గౌస్, యూసుఫ్, లతీఫ్, ఆసిఫ్, అసిన్, అతిఫ్, కలీమ్‌లు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యం



నకిరేకల్ : ప్రచారం నిర్వహిస్తున్న దైద రవీందర్



చిట్యాల: ఎలికట్టెలో ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

కేతేపల్లి: కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ముత్తినేని వీరయ్య అన్నారు. భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా గురువారం మండలంలోని చీకటిగూడెం గ్రామంలో పెరిక కులస్తులతో కలిసి నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ దాచేపల్లి నర్మదనాగేశ్వరావు, కోట పుల్లయ్య, కోట పూర్ణచందరావు, కోట శ్రీనివాస్, చింతం వెంకటేశ్వర్లు, ముత్తినేని నర్సయ్య, చింతం రాంలింగయ్య, కోట సైదయ్య, వడ్డె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దైద రవీందర్ ఆధ్వర్యంలో..

నకిరేకల్ : ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నేత దైద రవీందర్ నకిరేకల్ పట్టణంలోని పద్మశాలి కాలనీలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. యూసఫ్, నక్షత్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల మండలంలో..

చిట్యాల: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం మండలంలోని ఎలికట్టె, నేరడ, గాదిరెడ్డిపల్లి, వట్టిమర్తి, వనిపాకల, వెలిమినేడు, గుండ్రాంపల్లి, సుంకెనెపల్లి, పేరేపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చిట్యాల మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ తాళ్లవెల్లెంల ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య, గ్రామాల పార్టీ ఇంచార్జ్‌లు, నాయకులు ఏనుగు రఘుమారెడ్డి, సాగర్ల యాదయ్య, గుత్తా యాదగిరిరెడ్డి, దుబ్బాక రజనీకాంత్‌రెడ్డి, నర్రా మోహన్‌రెడ్డి, కొంపెల్లి వెంకట్‌రెడ్డి, బండ కృష్ణయ్య, ఆవుల యాదయ్య, చంద్రశేఖర్, వెంకటేష్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

చామలను గెలిపించాలని ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారం

కట్టంగూర్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం కట్టంగూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, గద్దపాటి దానయ్య, మర్రి రాజరత్నం, కొంపెల్లి యాదయ్య, మిట్టపల్లి శివశంకర్, ముక్కాముల శేఖర్, బొజ్జ శ్రీను, వెంకట్‌రెడ్డి, మద్దెల శంకర్, రెడ్డిపల్లి సైదులు, ఎర్కల లక్ష్మీనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ: భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బేత వెంకటేష్‌యాదవ్ కోరారు. గురువారం మండలంలోని వట్టిపల్లి పరిధి బట్లపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బడేటి వెంకటేష్, దుబ్బ మల్లేష్, మాదగోని వెంకన్న, దుబ్బ రాజు, గాదె వెంకటేష్, కేశగోని నగేష్, దుబ్బ నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పోరాడి రాజ్యాధికారాన్ని సాధించుకుందాం



మర్రిగూడ : ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మర్రిగూడ: బీసీలందరూ ఐక్యంగా పోరాడి రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు శివన్నగూడలో బీజేపీ కార్యకర్తలు గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపిస్తే పార్లమెంట్‌లో బీసీ నినాదాన్ని వినిపించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పందుల రాములుగౌడ్, గ్యార గోపాల్, రాజేందర్‌నాయక్, కుక్కల వెంకటేష్, గ్యార రామలింగం, మునగాల వెంకట్‌రెడ్డి, గుర్రం నరసింహ, కాటం నవీన్, పగడాల నగేష్, సిలివేరు శ్రీనివాస్, పిట్టల చంద్రమౌళి, బండి కిశోర్, ఎంజాల హరీష్, బొల్లం నవీన్, మహేష్, రవి పాల్గొన్నారు.

కట్టంగూర్ మండలంలో..

కట్టంగూర్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం మండలంలోని ఈదులూరు గ్రామంలో బీజేపీ నాయకులు గడప గడపకు తిరిగి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, వెంకటాద్రి, ముదుసు భిక్షపతి, పులకరం శంకర్, చెల్కపల్లి నర్సింహ, రాములు, బ్రహ్మచారి, తిరుమలేష్, ఓరుగంటి రమేష్ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య



నకిరేకల్ : ప్రచారం నిర్వహిస్తున్న జి.నాగయ్య

నకిరేకల్ : ఇచ్చిన హామీలు అమలుచేయని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ నకిరేకల్ పట్టణంలో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. బీజేపీ పాలనలో నిరుద్యోగ సమస్య బాగా పెరిగిందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో కందాల ప్రమీల, రాచకొండ వెంకట్‌గౌడ్, రెమిడాల పరుశరాములు, వంటిపాక వెంకటేశ్వర్లు, వరలక్ష్మీ, నాగమణి, ఇందిర, మర్రి వెంకటయ్య, వంటిపాక కృష్ణ, తాజేశ్వర్, భాస్కర్, సాకుంట్ల నర్సింహ పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి

చండూరు(గట్టుప్పల్): భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ సీపీఎం గట్టుప్పల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కర్నాటి సుధాకర్,, ఖమ్మం రాములు పెదగాని నరసింహ, కర్నాటి తుకారాం, కర్నాటి యాదయ్య, పసుపుల చెన్నయ్య, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ఇంటింటి ప్రచారం

చిట్యాల: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ చిట్యాలలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్,అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, నాయకులు ఐతరాజు నర్సింహ, శీలా రాజయ్య, లడే రాములు, మాదరబోయిన వెంకన్న పాల్గొన్నారు.

కృష్ణారెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ ప్రచారం



కనగల్ : ప్రచారం చేసున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాని కోరుతూ నల్లగొండ నియోజకవర్గ సమన్వయకర్త తిప్పన విజయసింహారెడ్డి, పలు వార్డులకు చెందిన నాయకులు గురువారం నల్లగొండలోని వివిధ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, కంచనపల్లి రవీందర్‌రావు, మారగోని గణేశ్, వటిపల్లి శ్రీనివాస్, మెరుగు గోపి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలి

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మొండికత్తి లింగన్న కోరారు. గురువారం నల్లగొండలోని వీటీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ మాట తప్పిందన్నారు. ఎర్ర ఆంజనేయులు, జిల్లా నరేందర్, వెంకన్న, చంద్రయ్య, కృష్ణ, బంగారయ్య పాల్గొన్నారు.

కనగల్ : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ మండల పరిధిలోని బుడుమర్లపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కారింగు జానయ్యగౌడ్, మాజీ ఉప సర్పంచ్ మామిడాల శివ, కందుల రమేష్, శీలం సైదులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డికి అధిక మెజార్టీ తీసుకురావాలి



నల్లగొండ: ఇంటింటి ప్రచారం చేస్తున్న రమేష్‌గౌడ్

నల్లగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ పట్టణంలోని అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ పట్టణంలోని 1, 2వ వార్డు పానగల్, 4వ వార్డు కేశరాజుపల్లిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

మర్రిగూడలో..

పార్లమెంట్ ఎన్నికల్లో మర్రిగూడ నుంచి నియోజకవర్గంలోనే ఎక్కువ మెజార్టీ రావాలని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మర్రిగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్లు ఆలకుంట్ల మోహన్‌బాబు, బుర్రి రజిత యాదయ్య, బోగరి ఆనంద్, పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, యాదయ్య, ఆలకుంట్ల నాగరత్నంరాజు, బొజ్జ శంకరయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు గురిజ వెంకన్న 16 వార్డ్ కౌన్సిలర్ అశ్విని భాస్కర్ గౌడ్, 13వ వార్డ్ ఇన్‌చార్జ్ గుమ్మల నాగిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ నల్లగొండ పట్టణంలోని 47వ వార్డులో వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచి నాయకులను ఎన్నుకోండి

చండూరు : ఓటర్లు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా. బొమ్మరబోయిన కేశవులు కోరారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఓటరు అవగాహన, చైతన్య కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జల సాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు తాగునీరు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే 1996లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జలసాధన సమితి ఆధ్వర్యంలో 600కు పైగా నామినేషన్లు వేసి సమస్యను దేశం దృష్టికి తీసుకెళ్లాం అని చెప్పారు . దాదాపు 400కు పైగా బరిలో నిలవడంతో ఎన్నిక వాయిదా వేసి మళ్లీ నిర్వహించాల్సి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.నరసింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధ్యాపకులు చైతన్య సుధా, బాల సైదులు, పద్మజ, జ్యోతి, పర్వతాలు, యూత్ ఫర్ సేవా కోఆర్డినేటర్ స్వామినాయక్, ఇడికూడ స్వామి తదితరులు పాల్గొన్నారు.